


(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

*19 రచయిత బాధ్యత*

పైన చెప్పిన అంశాన్ని పునరాలోచించుకుంటే మరొక విషయం కూడా ఇక్కడ చర్చించవలసిన ఆవశ్యకత కనపడుతోంది. రచయితకి తప్పనిసరిగా సమాజం పట్ల ఒక బాధ ఉండాలి. నేను పైన చెప్పదలుచుకున్న పాయింట్ - నిర్లక్ష్యంగా పాఠకుల బలహీనత మీద ఆడుకొమ్మని కాదు. సమాజం పట్ల బాధని కూడా పాపులర్ రచనగా వ్రాయొచ్చు అని చెప్పటమే నా ఉద్దేశ్యం. ఏ రచయితకయినా ఒక ఫీలింగ్, చుట్టూ ఉన్న పరిస్థితులపట్ల అసంతృప్తి, దాన్ని ఏ విధంగా మారిస్తే బావుంటుంది అన్న అభిప్రాయం తప్పనిసరిగా ఉండాలి. అదే విధంగా ఒక ఫీలింగ్, వర్జినిటీ, ఒరిజినాలిటీ కూడా ఉండాలి.

ఏదో రకంగా పుస్తకం పబ్లిష్ కావాలని, లేక సీరియల్ ప్రచురించబడాలనీ, శృంగారాన్నీ, సెక్స్‌నీ, వయొలెన్స్‌నీ, చౌకబారు థ్రిల్స్‌నీ, తను రచనలో చొప్పించి, కొంతమంది రచయితలు వ్రాస్తున్నారు. పత్రికాధిపతులు కూడా చౌకబారు సర్క్యులేషన్ పెంచుకోవటం కోసం ఇలాంటి వాటిని ప్రచురిస్తున్నారు. ఈ విషయంలో విమర్శకుల బాధ, తపన చాలావరకు నిజం. కానీ కేవలం ఒక రచన పాపులర్ రచన అయినంత మాత్రానే అది మంచి రచన కాదు అని అనటం మాత్రం వివాదాస్పదం.

*20. రచనల్లో ఎగతాళి*

వీలయినంతవరకూ ఒక రచయిత హాస్యాన్ని సృష్టించటం కోసం ఒకరి వృత్తినిగాని, ఒక అంగవైకల్యాన్నిగానీ, ఎగతాళి చేయటం మంచిది కాదు. నత్తి, పిచ్చి, కుంటి, గూని మొదలైన అంగవైకల్యం పాత్రలకాపాదించి దానిద్వారా హాస్యం పండించడం మంచిదికాదు. ఒక ప్రొఫెషన్‌లో వ్యక్తిని విలన్‌గా సృష్టిస్తే, అదే ప్రొఫెషన్‌లో ఒక మంచి ఆఫీసర్ ఉన్నట్టు తప్పనిసరిగా సృష్టించాలి. ఉదాహరణకి ఒక చెడు ఇన్‌స్పెక్టర్ ఉంటే, ఒక కమీషనర్ ఆఫ్ పోలీసో, ఒక కానిస్టేబులో మంచివాడుగా ఉండేటట్టు చూసుకోవాలి.

దీనివల్ల రచయిత తన వృత్తికి న్యాయం చేకూర్చటమే, ఆ వృత్తిలో ఉన్న పాఠకుల్ని కూడా దూరం చేసుకోకుండా ఉండగలడు.

*21. రచయిత - మార్గదర్శి*

ఇది చాలా మంచి పాయింట్. ప్రతి రచయిత గుర్తుంచుకోవలసిన విషయం. పాపులర్ రచయిత అవదలచుకున్న వ్యక్తి పాఠకులకి కేవలం ఒక్క అడుగు మాత్రమే ముందుండాలి. వాళ్ళకి కొద్దిగా పై ఎత్తులో ఉండి విషయాన్ని చెపుతూ ఉండాలే తప్ప, మరీ పాఠకులకి అర్థంకాని విషయాల్ని కానీ, తనకు తెలిసిన విషయ విజ్ఞాన, పరిజ్ఞానాన్నంతా కానీ చెప్పకూడదు. ఈ విధమైన తప్పు, ఐయాన్ రాండ్ అనే పాపులర్ రచయిత్రి నవలల్లో గమనిస్తాం. ఆమె యొక్క థియరీగానీ, విజ్ఞానం కానీ ఎంత గొప్పగా ఉంటుందంటే, కేవలం విజ్ఞులైన పాఠకులకి మాత్రమే అర్థమవుతుంది. ఆమె చెప్పే వాదనలని అర్థం చేసుకోవటం కూడా చాలా కష్టం. ఆ మెటీరియలిజం, ఆ

ఎకనమిక్సూ అవన్నీ సామాన్య పాఠకులకి అర్థం కాకపోవటం వల్లనే, ఆమె మిగతా అందరు పాపులర్ రచయితల కన్నా అద్భుతమైన రచయిత్రి అయినా కూడా అమ్మకాల విషయంలో రెండో మెట్టుమీదే ఉండిపోయింది.

*22. రచయిత - అహం:*

చాలాకాలం క్రితం నేను ఒక సభలో జరిగిన ఉపన్యాసానికి వెళ్ళాను. దానికి వక్తగా ఒక రచయిత రావటం సంభవించింది. తనెన్ని నవలలు వ్రాశాడు. ఒక నంబర్ వన్‌గా తయారవటానికి ఎంత కష్టపడ్డాడు, ప్రస్తుతం ఏ సినిమాలకి వ్రాస్తున్నాడు, అన్న విషయాల పట్లే అతని ఉపన్యాసం సాగింది. ఆ విధంగా రచయిత తన గొప్పతనాన్ని తనే చెప్పుకోవటం వల్లకానీ, తన అహాన్ని బయటపెట్టుకోవటం వల్లగానీ, పాఠకుల సానుభూతి, ఇష్టమూ కోల్పోతాడు. ముఖ్యంగా పత్రికల్లో ముఖాముఖి నిర్వహించేటప్పుడు లేదా ఇంటర్వ్యూల్లోనూ రచయిత తన అహం బయటపడేలాగా చేసుకోకూడదు. అతని భావాలు ఎలా ఉన్నాసరే కాగితం మీదికి వచ్చేసరికి నమ్రతగానూ, సబ్ మిస్సివ్‌గానూ ఉండాలి.

కొంతమంది రచయితలకి అకస్మాత్తుగా పాపులారిటీ వస్తుంది. అది ఒక గొప్ప మైకం లాంటిది. దాని నుంచి వీలయినంత తొందరగా బయటపడాలి. లేకపోతే తన గురించి తను చెప్పుకోవటం ఎక్కువవుతుంది. బాగా పాపులర్ కాకముందు ఈ విధంగా రచయిత తన గురించి తను చెప్పుకోవటం మొదలుపెడితే పాఠకుల్లో అతని పట్ల క్రేజ్ తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ తప్పు తరచు నేనూ చేస్తుంటాను.

అలాగే అప్పుడే సినిమాలోకి ప్రవేశిస్తున్న రచయిత, పెద్ద పెద్ద వ్యక్తులతో తనని కలుపుకోవటంగానీ, ఐడెంటిఫై చేసుకోవటంగానీ, రచనల్లో ఆ విషయం వ్రాయటం గానీ చేయకూడదు. ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న వర్ధమాన రచయితలు చేస్తున్న తప్పు ఇది. తన అనుభవాల్ని పాఠాలుగా తమని అనుసరించేవారికి చెప్పే స్థాయి ఏ రంగంలోనయినా అనుభవం వల్ల, విజ్ఞానం వల్ల, వయసు వల్ల వస్తుంది. నేనీ పుస్తకం వ్రాయటానికి నాకున్న ఏకైక అర్హత "వయసు" మాత్రమే అనుకుంటున్నాను.

*23. ఏకాగ్రత, సిన్సియారిటీ, జ్ఞాపకశక్తి*

ఈ మూడిటిలో మొదటిదీ, మూడోది దేముడు మనకి కాస్త ఇస్తే వాటిని అభివృద్ధి చేసుకునే విషయం మనమీదే ఆధారపడి ఉంటుంది, రెండోదైన సిన్సియారిటీ మాత్రం కేవలం మనకు సంబంధించినదే దానిలో దేముడికి సంబంధంలేదు. అది ఉంటే మిగతా రెండూ వస్తాయి.

మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. అయిదో అధ్యాయంలో "రెండోసారి చదవటం" అన్న హెడ్డింగ్ క్రింద ఒక ప్రశ్న ఇవ్వబడింది. మొదటి నాలుగుపేజీల్లో మూడు తప్పులు దొర్లాయనీ, వాటిని పట్టుకొమ్మని... ఆ విషయం అసలు ఆలోచించరా? ఎలాగో అధ్యాయం చివర్లో "జవాబు" ఉంటుందిలే అని దాని విషయం పట్టించుకోవటం మానేసారా? సిన్సియారిటీ అంటే అదే అదిలేని పక్షంలో ఈ పుస్తకాన్ని కాలక్షేపంగా చదివి పక్కన పడెయ్యండి. మీకు మరే విధంగానూ ఈ పుస్తకం ఉపయోగపడదు.

అదిసరే. అయిదో అధ్యాయం చివరకొచ్చేసరికి "ఆ తప్పులేమిటో ఇక్కడ ఇవ్వలేదే" అన్న అనుమానం మీకొచ్చిందా? వస్తే మీ జ్ఞాపకశక్తి అమోఘం! ఆ తప్పులేమిటో ఇక్కడ ఇస్తున్నాను. 1.భార్య మరణం ఒంటిగంటకు జరిగింది. అరగంట తరువాత సాయంత్రపు గాలులు ఎలా వీస్తాయి? 2. అంబాసిడర్ కారులో స్టీరింగ్ కుడివైపు ఉంటుంది. ఇన్‌స్పెక్టర్ ఎడమవైపు చూసి డ్రైవర్‌తో మాట్లాడటం ఏమిటి? 3. పావుగంటలో కారు యాభై కిలోమీటర్లు ప్రయాణించింది. ఇదెలా సాధ్యం?.... ఇవీ ఆ మూడు తప్పులు.

వచ్చే సంచికలో.. కథలు - సీరియల్స్ -నవలలు